227) మాళవి

ప॥ కలశాపురముకాడ గాచుకున్నాడు । వలసినవరాలిచ్చీ వాయునందనుడు ॥

చ॥ మాయబిలముచొచ్చి మగుడి యంబుధిలోని- । చాయాగ్రహము జంపి చయ్యన దాటి ।
ఆయెడ లంకిణి గొట్టి యంతలో జానకిగని । వాయువేగానవచ్చినవాయునందనుడు ॥

చ॥ కడలిదరినుండినకపులతో గూడుకొని । పడదీరగా మధువనము చొచ్చి ।
బడి రామునికి సీతాపరిణామమెల్లా జెప్పె । వడిగలవాడితడు వాయునందనుడు ॥

చ॥ రావణాదిరాక్షసుల రామునిచే సాధింపించి । ఆవిభుని సీత గూర్చి అయోధ్య నుంచె ।
శ్రీవేంకటేశు గొలిచి శిష్టరక్షణమునకై । వావిరి నిలుచున్నాడు వాయునందనడు ॥